# బాంధవి

-పగిడిపాల ఆంజనేయులు

**అతడొస్తాడనే ఆశతో మరోసారి చూసింది గేట్‌వైపు. కానీ అతడి జాడ లేదు!**

"జిల్లాస్థాయి కబాడీ ఛాంపియన్ షిప్ పోటీల్లో గెలిచి, ఛాంపియన్ షిప్ సాధించిన బిఎస్సీ ఫైనలియర్ స్టూడెంట్ కుమారి బాంధవిని స్టేజీ వద్దకు రావల్సిందిగా ఆహ్వానిస్తున్నాం!" ప్రిన్సిపాల్ గారి ఎనౌన్స్‌మెంట్ విన్పించడంతో లేచి నించోక తప్పలేదామెకి.



అప్పటికే ఆడిటోరియంలోని విద్యార్థులంతా ఈలలూ, చప్పట్లతో కేరింతలు కొడుతున్నారు.

అయితే "బాంధవి"కి... తన స్వచ్ఛమైన స్నేహంతో ఆకట్టుకుని... ఆమెకు చేరువయిన వాడు ఒక్కడే!

ఇప్పుడు బాంధవి ఎదురుచూస్తోంది అతడి కోసమే!!!

లయబద్ధంగా చప్పట్లు మోగుతున్నాయి. ముఖంలో నవ్వు పులుముకుంటూ, వేదిక ఎక్కి జ్ఞాపిక నందుకుంటూ అతడి కోసం చూసింది. అప్పటికీ రాలేదతడు!

అతడు రాకపోతే తాను వేదికే ఎక్కనని చెప్పింది. అయినా ఫలితం శూన్యమయింది.

"బాంధవి - నువ్వేమయినా మాట్లాడ్తావా?" అడిగారు ప్రిన్సిపాల్

"క్షమించండి సర్... ఏమ్మాట్లాడాలో తోచట్లేదు."

ఉప్పొంగుతున్న దుఃఖం కనుకొలకుల్లో అదిమిపట్టి సభకి నమస్కరించి వేదిక దిగి... చరచరా బయటకొచ్చింది.

చేతిలో ఉన్న జ్ఞాపిక వెక్కిరించినట్టనిపించింది.

జలజలారాలిపోతోన్న కన్నీళ్ళని తుడుచుకుంటోంటే అతడి మాటలు గుర్తొచ్చాయి!

"నేనో కన్నీటి చుక్కనయితే నీ చెక్కిలి మీద జారి నిన్ను కితకితలు పెట్టేవాణ్ణి తెల్సా?" అంతబాధలోనూ నవ్వకోకుండా ఉండలేకపోయింది

అశ్రువుల్ని రాల్చకుండా ఆనందాన్ని పంచియిచ్చే శక్తి ప్రేమకే కదా ఉండేది!!

కన్నీళ్ళని కర్చీఫ్‌తో తుడుచుకుంటూ తనగదివంక చూసిన బాంధవి కళ్ళేటా అయింది.

తన గదిలో లైటు వెలుగుతోంది. లోపలేం జరుగుతోందో తెలీకుండా గుమ్మానికి ఎర్రటి కర్టెనుంది. తన గదిలోకి రాత్రిపూట చొరవగా ఎవరొస్తారు?

తన స్నేహితురాలు వందన ఏమో అనుకుందామంటే ఆమె ఈ రోజే ఫంక్షన్‌కయినా రాకుండా ఇంటికెళ్ళిపోయింది.

అమ్మాయిని కాదుగదా!

అయినా ఆ ఎర్రటి కర్టెనువేపు ఒక్క క్షణం

ఎక్సయిటింగ్‌గా ఫీలవుతూ గుమ్మంలో అడుగు పెట్టింది.

"ఛాంపియన్ గారికి స్వాగతం! సుస్వాగతం!!"

కమ్మటి పెర్‌ఫ్యూమ్ వాసనతోపాటూ మంద్రమైన గొంతుక విన్పించింది, గుండెలో ఉద్వేగం పెరిగింది. నవ్వుతూ ఎదురొచ్చాడు చరణ్.

మరో అడుగు వేయగానే గులాబీ రేకులూ, సంపెంగలూ ఆమెని నిలువునా స్పృశించి మనస్సు ఆనంద డోలికల్లో ఊగిసలాడుతోన్న అనుభూతిని కలిగించింది!

ఎదురుగా నిలువెత్తు తైల వర్ణచిత్రంలో తనని చూసుకుని శిలాప్రతిమే అయింది.

"బాంధవీ! అంతమందిలో నేన్నీకేం చేయగలననిపించింది. అందుకే... ఏం తోచక..." ఐస్ క్రీ మందించాడు.

"చరణ్.నాకోసం ఇంతా ఏర్పాటుచేశావా? ఇంతసేపూ నిన్నెంత తల్చుకున్నాను నువ్వక్కడికి రాలేదని. నాకు నువ్వు కావాలి.. చరణ్!" బలమైన శీతల పవనం ఆమెని కమ్ముకుంటూండగా అతడి ఒళ్ళో వాలింది!

★ ★ ★

హోరాహోరీగా పోటీలు జరుగుతున్నాయి. రిపబ్లిక్‌డే సందర్భంగా ఏర్పాటుచేసిన ఆటల్లో అమ్మాయిలు నాలుగు జట్లుగా విడిపోయారు.

ఆ రోజు చివరి రోజు. అమ్మాయిల మధ్య కబాడీ పోటీలు రోజూ ఉండటంతో గ్రౌండంతా ఎటుచూసినా స్టూడెంట్స్‌తో సందడిగా ఉంది.

నిన్నామొన్నా కన్పించని కుర్రకారంతా ఈరోజు ఆటని ఎంతో ఉత్కంఠతో చూస్తున్నారు.

ఆ 'ఉత్కంఠత' ఆట కోసమయితే బాగుండేదే.. కాని అమ్మాయిల మూమెంట్స్‌పట్ల కావడమే విశేషం!

ఆ వెకిలి నవ్వుల్నీ వెధవ పోజుల్నీ సహిస్తూ ఒకటీ ఆరా లభించే ప్రోత్సాహంతో ఆడ్డమంటే సాహసమే!!

సివంగికూనలా దూకుతోన్న బాంధవి ధాటికి తట్టుకోవడం ప్రత్యర్థులకి కష్టమైపోతోంది. క్షణక్షణానికీ ఆమె స్కోరు పెరిగిపోతూనే ఉంది.

ఆట ఫైనల్‌కి రావడంతో వాతావరణం ఉద్వేగభరితంగా మారిపోయింది.

ఒకటీ...

రెండూ...

మూడూ... నిమిషాలు...

ఏం జరుగుతోందో తెల్సుకునేంతలో బాంధవి కాలు స్లిప్పయి పడిపోయింది. అంతా స్తంభించి పోయారు. ఆమె గెలుస్తుందనే ఊహ భరించని ఆకతాయి కుర్రాడు విసిరిన 'రాయి' అలా పడేసింది.

ఆ సమయంలోనే చరణ్ పరుగెత్తుకు రావడమూ, ఆమెని దగ్గరుకు తీసుకుని బెణికిన కాలుని మసాజ్ చేయడమ్మొదలెట్టే సరికి అందరూ చేష్టలు దక్కి నించుండిపోయారు!

బాంధవి మామూలు స్థితికొచ్చి తనెక్కడుందీ తెల్సుకుని సిగ్గుతో ముకుళించుకుపోయింది. గబుక్కున అతనికి దూరంగా లేచి పక్కకు జరిగింది.

గొప్ప గొప్ప ప్రేమ గాథల్ని చరిత్ర పుటల్లో లిఖించగల అవకాశవాది మగాడు!

అతడిక్కావల్సిందల్లా ఆ స్త్రీ మనస్సు ఒకసారి బలహీన పడ్డమే!!

కానీ ఎపుడయితే ఆ ప్రేమకీ, ఆకర్షణకీ మధ్య ఉన్న అస్పష్టమైన గీత చెరిగిపోతుందో! సరిగ్గా అప్పుడే వాళ్ళ మధ్య మరో 'మజిలీ' మొదలవుతుంది!!!

ఇలాంటి ప్రేమ మజిలీలు దాటితేనే గానీ ఈ జీవితంలోకి ప్రవేశించలేరు. అప్పటిదాకా కేవలం మధురోహలే వాళ్ళ కుటీరాలవుతాయి!!

"చరణ్!" కళ్ళు తెరచి పిలిచింది. కోయిల గానం విన్నంత మధురంగా అన్పించిందతడికా పిలుపు.

"ఈ రాత్రినీ, ఈ ఏకాంతాన్నీ చూస్తోంటే నీకేమీ అన్పించడం లేదా?"

"అన్పిస్తోంది!"

"ఏమనీ?"

అతడు సమాధానం చెప్పలేదు. బాంధవిని నిలువునా కమ్ముకున్నాడు! మరో మజిలీకి శ్రీకారం చుట్టాడు. అతి సహజంగా సృష్టి కార్యం నెరవేరింది!

★ ★ ★

పోటాపోటీగా చదివి ఫైనలియర్ ఎగ్జామ్స్ పాసయ్యారు. ఆ తర్వాత అతడికి పీజీలో సీటొచ్చింది. బాంధవి మరోసారి పట్టుదలగా ఎంసెట్‌కు రాసింది!

మలిసంజె కిరణాలు బాంధవి పెదాల మీద తళుకులీనుతున్నాయి.

గుడిలోని గంటలు గుండెల్లో సవ్వడి చేస్తున్నాయి. ఇద్దరూ కోనేటి మెట్లమీద కూర్చున్నారు.

కొబ్బరి తీసి అతడి నోటి కందిస్తోందామె.

ఒక్కో రాయినీ కోనేట్లోకి విసురుతున్నాడు! ఆ రాళ్ళు బుడుంగుమని మునిగిపోతూ నిర్దాక్షిణ్యంగా నీటిని కదిలిస్తున్నాయి!!

"బాంధవీ! నువ్వేం చేయదల్చుకుంటున్నావ్?" అడిగాడు.

"ఏం లేదు మహాశయా! తమరికి అన్నం తినిపిస్తూ, నీకో ముద్దా నాకో ముద్దా అని పాడుకోవడమే!!" చిన్నగా నవ్వింది.

ప్రపంచంలోని ఎనిమిదో వింతని వింటు



ష్నంత చోద్యంగా మొహం పెట్టి అడిగాడు.

"ఏయ్ అదేంటీ మరీ అమ్మమ్మలా మాట్లాడుతున్నావు?"

ఇద్దరి మధ్యా కాస్సేపు నిశ్శబ్దం అలము కుంది.

"బాంధవీ! ఎందుకో మన ప్రేమని పెళ్ళి పేరుతో శలభంలా మాడ్చడం నాకిష్టం లేదు. భార్యా భర్తలు ఒకర్నొకరు సాధించుకోవడం, అధికారం వెలాయించుకోవడం ఏం బాగుంటుంది చెప్పు?"

పెద్దరాయి కోనేట్లోకి విసిరేసి ఆమె మొహంలోకి చూశాడు.

'మరి ఎలావుంటే బావుంటుందో చెప్పు' అన్నట్టుగా చూసింది.

"పెళ్ళయితే వెన్నెల్లో నువు తినిపించే గోరుముద్దలుండవు. తీరిక లేకుండా ఉరుకులూ పరుగులూ మొదలవుతాయి. తరుములాటలు తప్పవు. తగవులూ తప్పవ్. మన ప్రేమ ఒక మధురమైన జ్ఞాపకంగా మిగిలిపోవాలే గానీ నలిగిపోకూడదు."

"చరణ్, అవన్నీ కాయితాల మీద కథలు రాసుకొనేందుకు బాగుంటాయి. నీకో మాట చెప్పనా? నేను పదోతరగతిలో ఉన్నప్పుడే నాన్న చనిపోయాడు. అప్పటి దాకా నాలుగ్గోడల మధ్య బతికిన నేను నాన్న నుంచి ప్రేమని పొందలేక పోయాను. బలాదూర్ తిరిగే అన్నయ్యా. అయోమయం లో అమ్మా... ఆ ఇల్లు నరకమన్పించింది! ఆ పరిస్థితు ల్లో నీ పరిచయం ఓ పెన్నిధి అన్పించింది. నిన్ను నిన్నుగానే చూసుకోవడం లేదు చరణ్. నాకు నీలో అమ్మా, నాన్నా, అన్నయ్యా అందరూ కన్పిస్తారు."

"నీదంతా సెంటిమెంటల్ ఫూలిష్‌నెస్!" విసుగు స్పష్టమయింది.

"చరణ్! ఇంతకీ నీ ఉద్దేశమేంటీ" చాలా సూటిగా అడిగింది.

"పెళ్ళితో మన ప్రేమ నశించి పోకూడదనే... నవమాసాలూ మోసి కనిపెం చిన అమ్మకూ నాన్నకూ నేను శత్రువుని కాకూడదనే" చెప్పేశాడు.

బాంధవి దిగ్భ్రాంతిగా చూసింది. చివరకు నోరు పెగల్చుకుని అడిగింది.

"చరణ్! నువ్వేనా... ఇలా మాట్లాడ్తోంది!"

"మరోలాకన్పిస్తున్నావా?" తేలిగ్గా నవ్వేశాడు.

బాంధవి కుప్పకూలి పోలేదు. భూమి పాయలై అందులోకి చొచ్చుకుపోలేదు.

ఇన్నాళ్ళూ... చరణ్ మాటల గారడీకి... తన ఆడతనాన్ని పణంగా సమర్పించుకున్న మూర్ఖత్వానికీ, బలహీనతకీ నవ్వుకుంది!

ప్రేమ కోసం పరితపించిన గుండెకు సేద తీరుస్తున్నానని ఇంతకాలం భ్రమ పడినందుకు సిగ్గుపడింది.

అంతే... ఆ తర్వాత తన స్పర్శ కోసంవ్వూ, తన సేవ కోసంవ్వూ పరితపిస్తూ... ప్రాణాలకోసం పోరాడు తున్న నిర్భాగ్యులకి ఆమె 'బంధువే' అయింది.

అమెకి ఇపుడు ప్రతి వ్యక్తిలోనూ ప్రేమ కన్పిస్తుంది. సకల చరాచర సృష్టంతా ప్రేమమయమే!

ప్రతి దుఃఖంలో సంతోషాన్ని ఆస్వాదించ గలుగుతోంది.

★ ★ ★

"డాక్టర్! మొన్నట్రోజు యాక్సిడెంట్ కేసులో మన నర్సింగ్ హోమ్‌లో అడ్మిటయిన వ్యక్తి కన్పించట్లేదు."

ఆదుర్దాగా ఆవైపు కదిలింది డాక్టర బాంధవి. ఆమె వెళ్ళేసరికి అక్కడగోల సద్దుమణిగింది.

"అంతావెతికారా?"

అడుగుతూ బెడ్ మీదికి దృష్టిసారించింది. దుప్పటి మడతల్లో రెపరెప లాడుతోన్న చరణ్ దస్తూరీ కన్పించింది.

'అజరామరమైన నీ ప్రేమౌన్నత్యం ముందు తల వంచుకుంటున్నాను. పదెకరాల మాగాణీకీ, రెండెకరాల మామిడితోటకీ అమ్ముడు పోయాను!

నీకంత ద్రోహం చేసిన నాలో... ఎందుకు జీవం పోశావు?

పైగా నా శరీరంలో నీ రక్తాన్ని ఎక్కించి నీ సేవలతో నాకు ఊపిరిపోసి నువ్వు ఇంకా ఇంకా... ప్రేమిస్తోంటే భరించలేకపోయాను!

నన్ను క్షమించమని అడిగే సాహసం చేయలేను కానీ ప్రేమ ఆశయం ప్రేమేనని నిరూపించిన నీ నీడలో నించోలేకపోతున్నాను. అందుకే పారిపోతున్నాను.

చివరగా ఒక్క మాట...

మేమంతా ఆకలిలో పుట్టి, ఆకలితోనే పెరిగిన దౌర్భాగ్యులం! ఆ దరిద్రమే నా ప్రేమని ఎ..లి..తీ..సు..కుం..ది...!!

సెలవ్

-చరణ్

★



